‘పది’లో విజయానికి ప్రత్యేక ప్రణాళిక

- పదవ తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు
- పక్కా ప్రణాళికతో ముందుకెళుతున్న విద్యాశాఖ
- ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు



కాకుమాను జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు

కాకుమాను: విద్యార్థి భవిష్యత్తుకు పదవ తరగతి పరీక్షలు చాలా కీలకం. ఈ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తే ఇంటర్, డిగ్రీలో మంచి కోర్సులు ఎంచుకుని వాటిలో రాణించడానికి అవకాశం ఉంటుంది. భవిష్యత్‌లో విద్యార్థులు ఎంచుకునే ప్రతి గ్రూపునకు పదవ తరగతి మార్కులే కీలకం . దానికి అనుగుణంగా మండలంలో నూరు శాతం ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసింది. ఉన్నత పాఠశాలల్లో ప్రతి రోజు పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం, ఎప్పటికప్పుడు స్లిప్ టెస్టులు, ఎసైన్‌మెంట్లు ఇస్తూ ఉపాధ్యాయులు విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు.

నూరుశాతమే లక్ష్యం..

మండలంలో మొత్తం ఆరు ఉన్నత పాఠశాలలు, ఒక గురుకుల పాఠశాల ఉండగా ఈ ఏడాది మొత్తం 242 మంది విద్యార్థులు పది పరీక్షలకు సిద్ధపడుతున్నారు. వీరిలో 162 మంది బాలికలు, 80 మంది బాలురు ఉన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 100 రోజుల ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తూ విద్యార్థులను నిరంతరం పర్యవేక్షించి వారి మదింపు అంచనా వేసి ఉత్తీర్ణత సాధించేలా తగిన చర్యలు చేపడుతున్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. వారిలో పరీక్షలంటే భయం తొలగించి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే ప్రయత్నం ఉపాధ్యాయులు చేస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 8.15 గంటల నుంచి 9.15 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. రోజుకో సబ్జెక్టు వంతున వారానికి ఏడు సబ్జెక్టులు బోధన చేస్తూ సమ్మేటివ్–1,సమ్మేటివ్–2 పరీక్షలు నిర్వహించి విద్యార్థుల నైపుణ్యాన్ని గుర్తిస్తున్నారు.

ప్రత్యేక తరగతులతో ప్రయోజనం..



పాఠశాలలో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించడం వలన సిలబస్ రివిజన్ చేసుకుంటున్నాను. నాకు గణితం , ఇంగ్లీష్ అంటే చాలా ఇష్టం. వాటితో పాటు అన్ని సబ్జెక్టుల్లో మంచి నైపుణ్యం కనబరుస్తున్నాను. ప్రత్యేక తరగతుల వలన అన్ని సబ్జెక్టుల్లో మంచి పట్టు సాధిస్తున్నాను.

– శ్రీ పణవి, విద్యార్థిని, కాకుమాను జెడ్పీ హైస్కూల్

సందేహాలు తెలుసుకుంటున్నాను..



ప్రత్యేక తరగతుల నిర్వహణ ఎంతో ప్రయోజన కరంగా ఉంది. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతూ విద్యను అందిస్తున్నారు. సందేహాలను ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుంటున్నాం. పది పరీక్షల్లో మంచి మార్కులు సాధించడానికి రోజు కష్టపడి చదువుతున్నాను.

– టి.పర్సిస్, విద్యార్థిని, కాకుమాను జెడ్పీ హైస్కూల్

ప్రణాళికలు అమలు చేస్తున్నాం



మా పాఠశాలలో వంద రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నాం. పది పరీక్షలకు సిద్ధపడే విద్యార్థులకు ఈ ప్లాన్ ఎంతో ఉపయోగపడుతుంది. పాఠ్యాంశాలపై విద్యార్థులకు ఏమైనా సందేహాలు ఉంటే వెంటనే వాటిని నివృత్తి చేస్తున్నాం. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టిపెట్టి మండలంలో ప్రథమస్థానం వచ్చే విధంగా ఉపాధ్యాయులందరం కలిసి కష్టపడుతున్నాం.

– బి.సత్యం, హెచ్ఎం, కాకుమాను జెడ్పీ హైస్కూల్

క్లుప్తంగా

విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలి

బీకేపాలెం(కాకుమాను): ఈనెల 8వ తేదిన నిర్వహించనున్న పరీక్షలకు ఉపాధ్యాయులు విద్యార్థులను సిద్ధం చేయాలని ఎంఈఓ కె.ఎ ఫ్.కెనడీ అన్నారు.మండలంలోని బీకేపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల ప్రగతి వివరాలను మంగళవారం ఎంఈఓలు కెనడీ, విజయ్ భాస్కర్‌లు పరిశీలించారు. పాఠశాల హెచ్ఎం కె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

కంది పంట పరిశీలన



గుంటూరు రూరల్: లాంఫాం ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం కంది పంటలో క్షేత్రస్థాయి సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. కంతేరు గ్రామంలో రైతు కర్రి రవికిరణ్ తాను విత్తిన కంది పంటలో పూత రాలేదని, ఎదుగుదల లేదని తెలపటంతో పంటను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.రాజమణి మాట్లాడుతూ రైతు కందిపంటను అక్టోబర్ నెలలో విత్తటం వల్ల పూత ఇంకా పూర్తిగా రాలేదని, 15 రోజుల్లో పూత మొత్తం వస్తుందని తెలిపారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకటరాములు, ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.వెంకటలక్ష్మి, సహాయ వ్యవసాయ సంచాలకులు జి.సునీత, శివకుమారి, వ్యవసాయ అధికారి రాజవంశీ, మండల వ్యవసాయ అధికారి పి.నరసింహారావు, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ జట్టుకు చలపతి విద్యార్థి ఎంపిక



గుంటూరు రూరల్: తమ కళాశాలలో విద్యార్థులకు విద్యతోపాటుగా క్రీడల్లోనూ నైపుణ్యతలను కల్పిస్తామని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థి అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో చదువుతున్న విద్యార్థి కెఎస్ఎస్ సాత్విక్ ఇటీవల జరిగిన ఆంధ్ర క్రికెట్ అండర్–19 జట్టులో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జట్టుకు ఎంపికయ్యాడన్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ టీంకు ఎంపికైన విద్యార్థిని కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎ.బాలాజీ, సెక్రటరీ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్ తదితరులు అభినందించారు.

ఘనంగా గంధ మహోత్సవం

పొన్నూరు: పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్‌లోని చౌక్ మసీదులో మంగళవారం శ్రీ అజ్మీర్ షరీఫ్ ఖాజా గరీబ్ నవాజ్ చిష్తి ఔలియా మహాత్ముల వారి గంధ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత ప్రత్యేక ప్రార్థనలు, అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. షేక్ గౌస్, మొహమ్మద్ ఫాజిల్, సయ్యద్ సంధాని, అబ్దుల్ జహీర్, అబ్దుల్ సలీం, షేక్ చాన్ బాషా, సయ్యద్ ఆసిఫ్, షేక్ అలీ, షేక్ బాబావాలి పాల్గొన్నారు. బులియన్ మర్చంట్ అసోసియేషన్ గుంటూరు జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ షఫాయితుల్లా, మిత్ర బృందం పర్యవేక్షించారు.

వేడుకగా దశావతార కల్యాణ మహోత్సవాలు



గుంటూరు రూరల్: గోరంట్ల గ్రామంలో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం (పెద్దగుడి)లో దశావతార కల్యాణ మహోత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. కళ్యాణ మహోత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు, హోమాలను నిర్వహించారు. మంగళవారం తొమ్మిదవరోజు స్వామివారికి శ్రీకృష్ణుని అవతారం అలంకరించి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండుగగా నిర్వహించారు. వందల మంది భక్తులతో దేవాలయం కిక్కిరిసింది. బుధవారం కార్యక్రమాల్లో భాగంగా శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు. దేవాలయం ప్రెసిడెంట్ యర్రంశెట్టి వేణుగోపాల్, చైర్మన్ కంచర్ల ఆంజనేయులు, సెక్రెటరీ గజవల్లి శివన్నారాయణ, ట్రెజరీ దేవరశెట్టి సురేష్‌బాబు, వైస్ ప్రెసిడెంట్ ఆళ్ల శివారెడ్డి, జవ్వాది సుబ్బారావు, కాబోలు పూర్ణచంద్రరావు, సూరె శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

అభ్యంతరాల స్వీకరణ గడువు పొడిగింపు

కాకుమాను: ఎస్సీ కుల గణనపై అభ్యంతరాల స్వీకరణ గడువు ఈ నెల 12వ తేదీ వరకు పొడిగించినట్లు తహసీల్దార్ బి.వెంకటస్వామి మంగళవారం తెలిపారు. ఈ నెల 7వ తేదితో గడువు ముగియనుండడంతో మరో 5 రోజులు పొడిగిస్తు ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.12వ తేదీ వరకు గ్రామ ప్రజల నుంచి గ్రామ వార్డు, సచివాలయాల్లో అర్జీలు స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు.

భూ సమస్యలకు సత్వర పరిష్కారం


అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ జియా

పొన్నూరు: భూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ అన్నారు. మంగళవారం మండలంలోని దండమూడిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సభలో తహసీల్దార్ పాల్గొని ప్రజల నుంచి భూమి రీ సర్వే కోసం మూడు అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో సర్వేయర్ సత్యనారాయణ, ఆర్ఐ శ్రీనివాస్, వీఆర్ఓ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చేబ్రోలులో గ్రామసభ

చేబ్రోలు: చేబ్రోలు గ్రామ పంచాయతీలో సర్పంచ్ అత్తోట వినీతారాణి అధ్యక్షతన మంగళవారం గ్రామసభ జరిగింది. గ్రామసభలో వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరై వారి శాఖలకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాల గురించి తెలియజేశారు. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కొల్లిమర్లలో...

కొల్లిమర్ల(కాకుమాను): గ్రామాలలోని రైతులకు సంబంధించిన భూ సమస్యలను పరిష్కరించేందుకే గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బి.వెంకటస్వామి అన్నారు. మండలంలోని కొల్లిమర్ల పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు తమ భూ సమస్యలను సదస్సులో అర్జీల రూపంలో అందజేసి పరిష్కరించుకోవాలని ఆయన తెలిపారు. ఈసందర్భంగా భూమి కొలతలకు 18, రికార్డులో నమోదు కొరకు 13 అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు. నేడు మండలంలోని బోడిపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

పెదకాకాని: భూ సమస్యలు పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును భూముల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పి.కృష్ణకాంత్ అన్నారు. పెదకాకాని మండలంలోని అనుమర్లపూడి గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సదస్సులో గ్రామ ప్రజల నుంచి సమస్యలు వెల్లువెత్తాయి. గ్రామంలో అసైన్డ్ భూములకు రికార్డు తారుమారు చేసి వ్యక్తుల పేరిట ఆన్‌లైన్ చేయడం పరిమాటిగా మారిందని తద్వారా వివాదాలు తలెత్తుతున్నాయని ప్రజలు అధికారుల దృష్టికి తెచ్చారు. మండలంలోని జరిగిన చివరి రెవెన్యూ సదస్సుకు దేవదాయశాఖ అధికారులు హాజరు కాగా రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది గైర్హాజరయ్యారు. ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, సర్పంచి దానబోయిన సుబాషిణి, డీటీ ప్రసాద్, సర్వేయర్ వీరాంజనేయులు, ఆర్ఐ సాయి శశాంక్, దేవదాయశాయశాఖ గ్రూపు టెంపుల్స్ ఈఓలు కృష్ణంరాజు, వీఆర్ఓలు, సచివాలయ సర్వేయర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.


తెలుగు భాషకు పూర్వవైభవం తేవాలి

పొన్నూరు: తెలుగు భాషకు పూర్వవైభవం తెచ్చేందుకు తెలుగు భాషాభిమానులు విశ్రాంత తెలుగు పండితులు, అధ్యాపకులు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని శ్రీ భావనారాయణ స్వామి సంస్కృత కళాశాల పూర్వ విద్యార్థి సంఘం నాయకుడు పిన్నమనేని గాంధీ అన్నారు. మంగళవారం స్థానిక సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇతర భాషలను నేర్చుకోవడం ముఖ్యమే, కానీ తెలుగు భాషను మరువ కూడదన్న విషయాన్ని తెలుగు వారందరూ గుర్తించాలన్నారు. ఇటీవల జరిగిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో దావులూరి రాజేంద్రప్రసాద్, మాజేటి జగన్నాథ రావు, నూకవరపు వెంకట్రావు, ఎం.కృష్ణకిషోర్, నాగలింగం హరిహర పంత్, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలు

పొన్నూరు: మండల పరిధిలోని దొప్పలపూడి అడ్డురోడ్డు సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్రగాయాలైన సంఘటన చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. పొన్నూరు నుంచి గుంటూరుకు ద్విచక్ర వాహనంపై వెళుతున్న భార్యా భర్తలు ఆగివున్న పొక్లెయిన్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే 108వాహనంలో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెల్మెట్‌ధారణపై స్పెషల్ డ్రైవ్



పెదకాకాని: రోడ్డు ప్రమాదాలు జరిగినపుడు తలకు బలమైన గాయాలు తగలకుండా ప్రాణాలు కాపాడటంలో హెల్మెట్ ఎంతో ఉపయోగపడుతుందని పెదకాకాని సీఐ పీటీ నారాయణస్వామి అన్నారు. పెదకాకాని పోలీసుస్టేషన్ వద్ద మంగళవారం హెల్మెట్ ధరించడంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చిన్నచిన్న కారణాలు చూపించి హెల్మెట్ ధరించకుండా పక్కన పెట్టడం మంచిదికాదన్నారు. మద్యం సేవించి వాహనం నడిపితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెదకాకాని ఎస్ఐ ఎస్‌కె మీరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు పంట నమోదు చేసుకోవాలి

పొన్నూరు: మండలంలోని రైతులు పంట నమోదు రబీ సీజన్లో తప్పక చేయించుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు వి.రామకోటేశ్వరి తెలిపారు. మంగళవారం చింతలపూడి, కసుకర్రు గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఐ.సునీత మాట్లాడుతూ జీవన ఎరువులు, జీవ సిలింద్ర నాశనులైన ట్రైకోడెర్మా విరిడి, సూడోమనాస్ ఉపయోగాన్ని రైతులకు తెలియజేశారు. ఉద్యాన శాఖ అధికారి పి.ఉష మాట్లాడుతూ తమలపాకు తోటలలో ఉన్న ఎండు తెగులు నివారణకు ట్రైకోడెర్మా విరిడిని ఉపయోగించాలని తెలిపారు. పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రవికిరణ్ మాట్లాడుతూ గడ్డి జొన్న విత్తనాలు, మినీ గోకులం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఓ డేగల వెంకట్రామయ్య సిబ్బంది కె. రత్న తేజస్వి, రైతులు పాల్గొన్నారు.

పంటలను నమోదు చేయించుకోవాలి..

కొమ్మూరు(కాకుమాను): రబీ సీజన్‌లో మొక్కజొన్న, మినుము, పెసర వంటి పంటలను సాగు చేస్తున్న రైతులు తమ పంట వివరాలను నమోదు చేసుకుని బీమా చేయించుకోవాలని ఏఓ కె.కిరణ్మయి అన్నారు. మండలంలోని కొమ్మూరు, బీకేపాలెం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ మీ సేవా కేంద్రాలలో సీఎస్ సెంటర్‌లను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. రైతు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డులు తీసుకువెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు. ఆయా గ్రామాల రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ. 60 లక్షలు తీసుకుని మోసం చేశారంటూ ఫిర్యాదు

ప్రత్తిపాడు: వ్యాపారం కోసమని పలు దఫాలుగా రూ.60 లక్షలు తీసుకుని తిరిగి ఇవ్వకుండా ఇద్దరు వ్యక్తులు మోసం చేస్తున్నారంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు పోలీసు స్టేషనులో కేసు నమోదైంది. ఎస్ఐ కె.నాగేంద్ర తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలెం గ్రామానికి చెందిన సూరగాని గోపిరెడ్డితో గుంటూరుకు చెందిన గాలం శ్రీనివాసరావు, అతని సోదరుడు గాలం కార్తీక్, వారి బంధువు గాలం రేవతిలకు పరిచయం ఏర్పడింది. దీంతో వారు ఆరు, ఏడు సంవత్సరాలుగా వ్యాపార పెట్టుబడుల నిమిత్తం గోపిరెడ్డి దగ్గర డబ్బులు తీసుకోవడం, తిరిగి చెల్లించడం చేస్తున్నారు. అదే నమ్మకంతో పెట్టుబడులకు పెద్దమొత్తంలో నగదు కావాలని వారు కోరడంతో గోపిరెడ్డి తన బంధువుల నుంచి సుమారు రూ. 60 లక్షల వరకు డబ్బులు తీసుకుని పలు దఫాలుగా వారికి ఇచ్చాడు. తీసుకున్న డబ్బులు తిరిగి చెల్లించాలని అనేకసార్లు శ్రీనివాసరావు, కార్తీక్, రేవతిలను గోపిరెడ్డి అడుగుతున్నప్పటికీ ఫలితం లేకపోయింది. పెద్దమనుషుల సమక్షంలో అంగీకార పత్రాలు రాసుకున్నప్పటికీ డబ్బులు ఇవ్వకుండా, ఫోన్లు ఎత్తకుండా, ఇంట్లో లేకుండా తిప్పుకుంటుండటంతో బాధితుడు గోపిరెడ్డి మంగళవారం ప్రత్తిపాడు పోలీస్ స్టేషనులో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. మాయమాటలు చెప్పి నమ్మించి మోసం చేశారంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశువులను తరలిస్తున్న లారీ స్వాధీనం

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని బుడంపాడు గ్రామం హైవేపై అక్రమంగా తరలిస్తున్న ఆవులు, ఎద్దులు తరలిస్తున్న లారీని నల్లపాడు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం వైజాగ్ నుంచి చెన్నై వైపుగా వెళుతున్న లారీని స్పెషల్ బ్రాంచ్ సమాచారం మేరకు అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలోని వెంగళాయపాలెం నందున్న గోవులదొడ్డికి తరలించాలని ప్రయత్నించగా మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నతాధికారి అనుమతి ఇవ్వకపోవటంతో గోవులను తాడేపల్లిలోని ఇస్కాన్ గోశాలకు తరలించారని తెలిపారు.

కడుపునొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్య

ప్రత్తిపాడు: కడుపు నొప్పి తాళలేక వివాహిత పురుగుమందు తాగి బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం ఇలపావులూరు గ్రామానికి చెందిన పులి రాంబాబు, కోటిలక్ష్మి దంపతుల కుమార్తె సాయిసుధకు ఆరునెలల కిందట గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండం తుమ్మలపాలెం గ్రామానికి చెందిన కొమ్మనబోయిన సురేష్‌తో వివాహం అయ్యింది. రెండు నెలల క్రితం విపరీతమైన కడుపునొప్పి రావడంతో సాయిసుధ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది.

మళ్లీ ఈ నెల మూడవ తేదీన కూడా భరించలేని విధంగా కడుపునొప్పి వచ్చింది. దీంతో నొప్పి తాళలేక ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఇంట్లో ఉన్న గడ్డి మందును థమ్స్‌అప్‌లో కలుపుకొని తాగింది. విషయాన్ని తండ్రికి ఫోన్ చేసి చెప్పడంతో ఆయన అల్లుడు సురేష్‌కు సమాచారమిచ్చాడు. దీంతో భర్త సాయిసుధను 108లో గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఈ మేరకు తండ్రి రాంబాబు ఇచ్చిన పిర్యాదు మేరకు ప్రత్తిపాడు ఎస్ఐ కె. నాగేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్యాన్ని సాధించిన తర్వాత వచ్చే కిక్కే వేరు

- గుంటూరు జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్
- ఘనంగా ముగిసిన విజ్ఞాన్ స్రవంతి క్రీడా, సాంస్కృతిక ఉత్సవాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు రూరల్: విద్యార్థులు ఏదైనా లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దాన్ని సాధించిన తర్వాత వచ్చే కిక్కు, అనుభూతిని మాటల్లో వర్ణించలేమని గుంటూరు ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ డిగ్రీ, పీజీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన విజ్ఞాన్ స్రవంతి క్రీడా, సాంస్కృతిక ఉత్సవాలు 2025 ఘనంగా మంగళవారం ముగించారు. చివరి రోజు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ కళాశాలలో ఉన్నప్పుడే భవిష్యత్ గురించి ప్లాన్ చేసుకోవాలన్నారు. జీవితంలో నచ్చిన రంగాన్నే ఎంచుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు.

ప్రవర్తనే మనల్ని నిర్ణయిస్తుంది : సంపూర్ణేష్ బాబు

జీవితంలో మనం ఎదుటివారితో మాట్లాడే మాటతీరు, ప్రవర్తనే మన స్థాయిని నిర్ణయిస్తుందని ప్రముఖ సినీ హీరో సంపూర్ణేష్ బాబు అన్నారు. మనం ఇతరులకు ఇచ్చే సంస్కారమే మనల్ని జీవితంలో ఉన్నతస్థానాలకు తీసుకెళ్తుందన్నారు. విద్యార్థులందరూ కలలు కని వాటిని సాకారం చేసుకోవాలన్నారు. గుడివాడ జూనియర్ సబ్ రిజిస్ట్రార్ వి.మణిచైతన్య మాట్లాడారు. అనంతరం వివిధ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలు, మెమొంటోలు అందజేసారు. కార్యక్రమంలో విజ్ఞాన్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.అనురాధ, నిరుల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాధిక, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న సినీ నటుడు సంపూర్ణేష్‌బాబు

‘మలినేని’లో ఏఓటీ హ్యాకథాన్


హ్యాకథాన్‌లో విద్యార్థినులు చేసిన ప్రయోగాలను పరిశీలిస్తున్న జ్యూరీ సభ్యులు

ప్రత్తిపాడు: విద్యార్థులు వారిలో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడే ఆవిష్కరణలను రూపొందించాలని మలినేని కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం సీఎస్ఈ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులకు మేక్‌స్కిల్డ్ కంపెనీ ఆధ్వర్యంలో 36 గంటల ఏఓటీ హ్యాకథాన్‌ను నిర్వహించారు. మొత్తం 23 టీంలు పాల్గొని పలు రకాల ప్రయోగాలను ఆవిష్కరించారు. జ్యూరీ సభ్యులుగా వ్యవహరించిన ఆర్‌వీఆర్‌జేసీ ఇంకుబేషన్ మేనేజర్ డాక్టర్ శోభ, శ్రీఖా సంస్థల సీఈఓ బి.నాగమునేష్‌లు వాటిలో ఐదు ఉత్తమ ప్రయోగాలను ఎంపిక చేసి ఆయా టీంలను విజేతలుగా ప్రకటించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో చైర్మన్ పెరుమాళ్లు మాట్లాడుతూ ఇన్నోవేటివ్ కార్యక్రమాల ద్వారా విద్యార్థులు వారి ప్రతిభను నిరూపించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. డాక్టర్ కె.శోభ మాట్లాడుతూ విద్యార్థినులు అవకాశాలను అందిపుచ్చుకుంటూ అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలవాలని కాంక్షించారు. డాక్టర్ మునేష్ మాట్లాడుతూ విద్యార్థుల పరిశోధనలు సమాజహితంగా ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జె.అప్పారావు, సిఎస్ఈ హెడ్ డా. జి.వీరాస్వామి, మేక్‌స్కిల్డ్ సీఈఓ పి.మధు, ఆయా విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై అక్రమ కేసు ఎత్తివేయాలి


రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న న్యాయవాదులు

పొన్నూరు: పట్టణానికి చెందిన న్యాయవాది బేతాళ ప్రకాశరావుపై పట్టణ పోలీసులు పెట్టిన అక్రమ కేసును ఎత్తివేయాలని పొన్నూరు న్యాయవాదుల సంఘ సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం ఐలాండ్ సెంటర్‌లో రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ సంఘటనకు బాధ్యులైన వారిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సంఘటనకు బాధ్యులైన పట్టణ సీఐ రవికిరణ్, ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ ఫిరోజ్‌ఖాన్‌లపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. దీక్షలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.జయరాజ్, న్యాయవాదులు వర్ధన్, జిఎస్. రాయల్, పి.విజయ్‌కుమార్, న్యాయవాదుల గుమస్తా సంఘం అధ్యక్షుడు పులిపాక రామారావు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు.

రెవెన్యూ సదస్సులో అర్జీ తీసుకునే దిక్కులేక..!


అర్జీ తీసుకుని అక్‌నాలెడ్జ్‌మెంట్ ఇవ్వాలని సిబ్బందిని అడుగుతున్న రైతులు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండలం యనమదల గ్రామంలో మంగళవారం స్థానిక గ్రామ సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఉదయం వరకు తహసీల్దార్ ఉండి రైతులు సమస్యలు తెలుసుకున్నారు. మధ్యాహ్నం నుంచి తహసీల్దార్‌తో పాటు ఇతర శాఖల అధికారులంతా సదస్సులో లేకుండా కిందిస్థాయి సిబ్బందిపై సదస్సు భారం వదిలేసి వెళ్లిపోయారు. అదే సమయంలో ప్రత్తిపాడుకు చెందిన కొందరు రైతులు తమ సమస్యలను విన్నవించుకునేందుకు రెవెన్యూ సదస్సుకు వెళ్లారు. తీరా అక్కడ అధికారులు ఎవ్వరూ లేకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ఇదేమని అక్కడ ఉన్న సిబ్బందిని అడగ్గా ఎవ్వరూ లేరని సమాధానమిచ్చారు. ఏమిచేయాలో పాలుపోని రైతులు తమ సమస్యకు సంబంధించిన అర్జీని తీసుకుని అక్‌నాలెడ్జ్‌మెంట్ ఇవ్వాలని సిబ్బందిని కోరారు. అందుకు కూడా వారు నిరాకరించడంతో రైతులు ఏమిచేయాలో పాలుపోక వెనుదిరగాల్సి వచ్చింది. సీఎం మొదలు మంత్రులు, ఎమ్మెల్యేల వరకు రెవెన్యూ సదస్సులపై అంత.. ఇంత..అంటు మాటలు చెబుతుంటే గ్రామస్థాయిలో మాత్రం అర్జీలు తీసుకునే దిక్కుకూడా లేకపోవడం విమర్శలకు తావిచ్చింది. తమ భూములున్న సర్వే నంబరును దేవదాయశాఖ అధికారులు నిషేధిత జాబితాలోకి చేర్చడం వలన గత కొన్ని సంవత్సరాలుగా మేమంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, సమస్యను చెప్పుకునేందుకు వస్తే ఇక్కడ రెవెన్యూ, దేవదాయశాఖ అధికారులెవ్వరూ లేరని, కనీసం ఉన్న సిబ్బంది అర్జీ తీసుకోమన్నా తీసుకోలేదని రైతులు వాపోయారు.

మరుగుదొడ్ల క్లీనింగ్ కిట్లు పంపిణీ

ప్రత్తిపాడు: పాఠశాలల్లో మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఎంఈఓ సీహెచ్. రమాదేవి అన్నారు. పాఠశాలల మరుగుదొడ్లను శుభ్రపరిచేందుకు ప్రభుత్వం టాయిలెట్ క్లీనింగ్ కిట్లను సరఫరా చేసింది. స్థానిక మండల విద్యావనరుల కార్యాలయంలో మంగళవారం ఎంఈఓలు సీహెచ్. రమాదేవి, జి. లీలారాణిలు కిట్లను హెచ్ఎంలకు అందించారు.

ప్రత్యేక తరగతుల పరిశీలన..

నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పది ప్రత్యేక తరగతులను ఎంఈవో–2 జి. లీలారాణి మంగళవారం సాయంత్రం పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పట్టుదలతో చదివి, నూటికి నూరు శాతం ఫలితాలు సాధించాలని సూచించారు. పది ఫలితాలే భవిష్యత్తుకు గీటురాయని, నిర్లక్ష్యం చేయవద్దని ఈ సందర్భంగా విద్యార్థులకు చెప్పారు.